## విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా చూడాలి

**కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్**


సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, ఫిబ్రవరి 19 : విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. కామారెడ్డి పట్టణంలోని కాకతీయ నగర్‌లోని 33/11 కే.వీ ఉపకేంద్రాన్ని కలెక్టర్ బుధవారం సందర్శించారు. విద్యుత్ సరఫరా ఎక్కడి నుంచి వస్తున్నది, ఎంత మేరకు సరఫరా అవుతున్నది, ఒక వేళ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు ప్రత్నామ్నాయ చర్యలు ఎలా తీసుకుంటారు, ఎంత మంది సిబ్బంది విధుల్లో ఉంటారనే విషయాలను ట్రాన్స్‌కో శాఖ ఎస్ఈ శ్రావణ్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ కల్యాణ్ చక్రవర్తి, ఏడీఈ కిరణ్ చైతన్య, ఏఈ వెంకటేశ్, డీఈ నాగరాజు, ప్రొటెక్షన్ ఏడీఈ జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్యులు అందుబాటులో ఉండాలి


బీర్కూర్ మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

నస్రుల్లాబాద్, ఫిబ్రవరి 19 : వైద్యులు అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిచాలని సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. బీర్కూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె బుధువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మందుల స్టాక్, సరిపడ వైద్యులు ఉన్నారా అని అడిగి తెలుసుకున్నారు. పేషంట్ల వద్దకు వెళ్లి వైద్య సేవలు ఎలా అందుతున్నాయని ఆరా తీశారు. రక్త పరీక్ష, కాన్పుల గది, మరుగుదొడ్లను పరిశీలించారు. దవాఖాన పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీ అవెన్యూ ప్లాంటేషన్ సందర్శించి మొక్కలకు నీళ్లు పోయడాన్ని పరిశీలించారు. వేసవి కాలంలో నీటి సరఫరాకు అంతరాయం కలుగకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లత, ఎంపీడీవో భాను ప్రకాశ్, ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

# మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలి

**సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ సెక్రెటరి నాగరాణి**

రాజంపేట్, ఫిబ్రవరి 19 : మండలంలోని కొండాపూర్ గ్రామంలో ఉన్న రైతు వేదికలో సఖీ వన్ స్టాప్ సెంటర్, డిస్ట్రిక్ లీగల్ సర్వీస్ అథారిటీ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు చట్టాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ సెక్రెటరి నాగ రాణి హాజరై మాట్లాడారు. మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలని అన్నారు. స్త్రీలు ఎదుర్కొంటున్న గృహహింస గురించి వివరిస్తూ హింసల నుంచి రక్షణ కల్పించడం కోసమే సఖీ కేంద్రం ఐదు రకాల సేవలు అందిస్తున్నదని అన్నారు. సమస్యల్లో ఉన్న మహిళలకు సైకో సోషల్ కౌన్సెలింగ్, న్యాయ సేవ సలహాలు, పోలీస్ సహకారం, వైద్య సహాయం కూడా అందిస్తామని తెలిపారు. సమస్య తీవ్రతను బట్టి సఖీ సెంటర్ సహకారం కోరితే ఐదు రోజులు షెల్టర్‌లో ఉంచుకొని వారికి కావాల్సిన సదుపాయాలు కల్పిస్తామన్నారు. స్త్రీలకు ఎలాంటి సమస్యలు ఉన్నా 181కి కాల్ చేస్తే మీ వద్దకే వచ్చి రక్షణ కల్పిస్తారని తెలిపారు. స్త్రీలు, బాలబాలికలు, గర్భిణులకు సంబంధించిన చట్టాలను క్లుప్తంగా వివరించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే శిక్షలు తప్పవని, బాల్య వివాహాల నివారణకు 1926 చట్టం ప్రకారం అమ్మాయికి 18, అబ్బాయికి 21 ఏండ్లు నిండిన తర్వాతనే వివాహం చేయాలన్నారు. ఎవరైనా బాల్య వివాహాలు చేస్తే 1098కి కాల్ చేయాలని సూచించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలించాలని, బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా లింగ బేదాలు లేకుండా అందరూ ఉన్నత చదువులు చదవాలన్నారు.


కొండాపూర్‌లో మహిళలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జ్ నాగరాణి

లైంగిక వేదింపుల గురించి విరిస్తూ పోక్సో చట్టం గురించి వివరించారు. అనంతరం సఖీ సెంటర్, బేటీ బచావో బేటీ పడావో పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సఖీ కేంద్రం నిర్వాహకురాలు భారతి, గవర్నమెంటు దవాఖాన సూపరింటెండెంట్ ఫరీద, మహిళా శిశు సంక్షేమ శాఖ సీడీపీవో, రాజంపేట ఎస్సై పుష్పరాజ్, ఏపీఎం సాయిలు, జిల్లా మహిళా సాధికార కోఆర్డినేటర్ శిరీష, మెడికల్ డిపార్ట్‌మెంట్ సుభాషిని, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి


సమావేశంలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న జోనల్ అధికారి పూర్ణచందర్‌రావు

బాన్సువాడ రూరల్, ఫిబ్రవరి 19 : తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ గురుకుల పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినుల భద్రత, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సాంఘిక సంక్షేమ గురుకులాల జోనల్ అధికారి పూర్ణ చందర్‌రావు ప్రిన్సిపాల్, సిబ్బందికి సూచించారు. మండలంలోని బోర్లం క్యాంపు సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలను ఆయన బుధవారం సందర్శించారు. అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల భద్రతకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తున్నదని, విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. పాఠశాలలో కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరారు. ప్రిన్సిపాల్ రమాదేవి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి

భిక్కనూరు, ఫిబ్రవరి 19 : భిక్కనూరు టోల్ ప్లాజాలో పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ టోల్ ప్లాజా మేనేజర్‌కు కార్మికులు బుధవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో టోల్ ప్లాజా యూనియాన్ అధ్యక్షుడు నర్సాగౌడ్, టోల్ ప్లాజా కార్మికులు పాల్గొన్నారు.

## ఘనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి


బాన్సువాడలో ఛత్రపతి శివాజీ జయంతిలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు


పిట్లంలో శోభాయాత్ర నిర్వహిస్తున్న హిందూ సంఘాల సభ్యులు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, ఫిబ్రవరి 19 : జిల్లా వ్యాప్తంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని బజరంగ్‌దళ్ సభ్యులు, యువకులు, నాయకులు, గ్రామస్తులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు చోట్ల శివాజీ మహారాజ్ విగ్రహాలు ఆవిష్కరించారు. ఆలయాల్లో పూజలు చేసి ప్రధాన వీధుల గుండా శివాజీ మహారాజ్ చిత్రపటంతో శోభాయాత్ర నిర్వహించారు.

## లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి జైలు శిక్ష

కామారెడ్డి, ఫిబ్రవరి 19 : కన్న కూతురిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి కోర్టు ఏడేండ్ల ఏండ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధించినట్లు ఎస్పీ సింధూశర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. బీబీపేట్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఒక గ్రామానికి చెందిన 15 ఏండ్ల కూతురు 2024 జనవరి 14వ తేదీన ఇంటి బయట ఆడు కుంటుండగా ఇంట్లోకి పిలిచి తండ్రి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక ఏడుస్తూ తన తల్లి బీబీపేట మార్కెట్ వెళ్లి ఇంటికి రాగానే జరిగిన విషయా న్ని చెప్పింది. 2024 జనవరి 15వ తేదీన స్థానిక బీబీపేట్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి సాక్షాధారాలను పరిశీలించగా కేసు రుజువైంది. కామారెడ్డి మొదటి అదనపు జిల్లా జడ్జి లాల్‌సింగ్ శ్రీనివాస్ నాయక్ నిందితుడికి ఏడేండ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ కేసు సరైన పద్ధతిలో విచారించిన అప్పటి డీఎస్పీలు శ్రీనివాసులు, ప్రకాశ్, నాగేశ్వర్ రావు, సీఐ తిరుపయ్య, ఎస్సై అనిల్, పోలీసు తరపున వాదనలు వినిపించిన స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శేషు, కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టిన ప్రస్తుత ఏఎస్పీ చైతన్యారెడ్డి తదిరులను ఎస్పీ అభినందించారు.

## సోషల్ వెల్ఫేర్ పాఠశాల తనిఖీ

భిక్కనూరు, ఫిబ్రవరి 19 : మండలంలోని సిద్ధరామేశ్వరనగర్ గ్రామ పరిధిలో ఉన్న సోషల్ వెల్ఫేర్ పాఠశాలను అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల తరగతి గదులు, కిచెన్ షెడ్డు, విద్యార్థులకు వండిన ఆహార పదార్థలను పరిశీలించారు అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట మండల ప్రత్యేకాధికారి రజిత, భిక్కనూరు పంచాయతీ ఈవో మహేశ్ గౌడ్, సిబ్బంది ఉన్నారు.

## జిల్లా క్రీడాకారులకు మెడల్స్



మెడల్స్ సాధించిన కామారెడ్డి జిల్లా క్రీడాకారులు

కామారెడ్డి, ఫిబ్రవరి 19 : జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు మెడల్స్ సాధించారని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, కార్యదర్శి అనిల్ కుమారులు బుధవారం తెలిపారు. రాష్ట్రస్థాయి 11వ యూత్, ఆర్‌ఏజ్ గ్రూప్ చాంపియన్‌షిప్ హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ గ్రౌండ్స్, సింథటిక్ ట్రాక్‌లో రంగారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో జిల్లాకు చెందిన ఈశ్వర ప్రసాద్ (అండర్–20) జావలిన్‌త్రోలో గోల్డ్ మెడల్, స్పందన (అండర్–18) షాట్‌పుట్‌లో బ్రాంజ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

### టీఎన్జీవోస్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

కామారెడ్డి, ఫిబ్రవరి 19 : టీఎన్జీవోస్ కామారెడ్డి జిల్లా క్యాలెండర్, డైరీని హైదరాబాద్‌లోని టీఎన్జీవోస్ భవన్‌లో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేన్ బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, కార్యదర్శి నాగరాజు, కోశాధికారి దేవరాజు, ఉపాధ్యక్షుడు సాయిలు, శ్రావణ్ కుమార్, రాజేశ్వర్, సంయుక్త కార్యదర్శులు రమణకుమార్, అబ్దుల్ ఖదీర్, శ్రీకాంత్, ఆయా మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

### కంటి వైద్య శిబిరం

బాన్సువాడ, ఫిబ్రవరి 19 : బాన్సువాడలోని ప్రభుత్వ మాతా శిశు దవాఖానలో విద్యార్థుల కోసం బుధవారం కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కంటి వైద్యుడు విజయ్ భాస్కర్ విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ శిబిరం ఐదు రోజులపాటు కొనసాగుతుందని తెలిపారు. సీహెచ్‌వో దయానంద్, ముజామిల్, హెచ్ఈవో సుధాకర్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో మీసేవా కేంద్రం దగ్ధం


మల్లూర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన మీసేవా కేంద్రం

నిజాంసాగర్, ఫిబ్రవరి 19 : షార్ట్ సర్క్యూట్‌తో మీసేవా కేంద్రం దగ్ధమైన ఘటన మండలంలోని మల్లూర్ గ్రామంలో చోటు చేసుకున్నది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం 11 గంటల సమయంలో ఎలక్ట్రిక్ బోర్డులో ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ కావడంతో దుకాణం మొత్తం మంటలు అంటుకొని ప్రింటర్, కంప్యూటర్, మీసేవా పత్రాలు, సామగ్రి కాలిపోయాయి. మొత్తం రూ. ఒక లక్షా 50 వేల నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు. అగ్నిప్రమాదంతో ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డానని, ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని ఆయన కోరాడు.

## విద్యార్థుల క్షేత్ర పర్యటన


గురుకుల పాఠశాల విద్యార్థులకు వివరాలు వెల్లడిస్తున్న అటవీశాఖ అధికారులు

లింగంపేట(తాడ్వాయి), ఫిబ్రవరి 19: తాడ్వాయి గురుకుల పాఠశాల విద్యార్థులు బుధవారం క్షేత్ర పర్యటనకు తరలివెళ్లారు. కామారెడ్డి రేంజ్ పరిధిలోని కల్వరాల అటవీ ప్రాంతంలో క్షేత్ర పర్యటనకు వెళ్లారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులు, జల సంరక్షణ చర్యలు, వన్యప్రాణుల సంచారం, అటవీ ప్రాంతంలో ఉన్న చెట్లు, ఖాళీ ప్రదేశాల్లో పెంచుతున్న మొక్కలు, వర్షం నీరు వృథాగా పో కుండా భూమిలో ఇంకడానికి కాంటూర్ కందకాల తవ్వకాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శిరీష, అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ అధికారి శ్రీధర్‌రావు, సెక్షన్ అధికారి మీర్ ముబాషీర్, గోపాల్, బీట్ అధికారులు మహేశ్, పద్మారావు, దీపిక ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★ I,Kandadi Rajitha R/o H.No.2-89 ,Yerrapahad (V), Tadwai (M), Kamareddy -Dist. I have changed my name to DEVIREDDY RAJITHA W/o DEVIREDDY RAM MOHAN REDDY(New name) for all future purposes
NTZ-33449

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

### పోలింగ్ కేంద్రాల పరిశీలన

గాంధారి, ఫిబ్రవరి 19: మండలంలోని ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ బుధవారం పరిశీలించారు. మండల కేంద్రలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలు పరిశీలించి, ఓట్లు వేయడానికి వచ్చే ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం మండలంలోని రాంపూర్‌గడ్డ గ్రామ పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ సతీశ్‌రెడ్డి, ఎంపీడీవో రాజేశ్వర్, నాయబ్ తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ ప్రదీప్ ఉన్నారు.

## బీఆర్ఎస్ సమావేశానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే


నాగిరెడ్డిపేట/లింగంపేట, ఫిబ్రవరి 19: తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, కామారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సంపత్ గౌడ్ తదితర నాయకులు

## ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్యాభోధన


గాంధారి పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న గాంధారి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ గంగారాం

గాంధారి, ఫిబ్రవరి 19: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందుతున్నదని గాంధారి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ గడ్డం గంగారాం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు, గండివేట్, పొతంగల్ కలాన్, గౌరారం, పేట్‌సంగెం, చద్మల్ తండా, లింగంపేట మండలంలోని నల్లమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పదోతరగతి పూర్తయిన తర్వాత ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటస్వామి, శ్రీధర్, రమేశ్, సుజాత, అంజలి, గణేశ్, ఉదయ్ పాల్గొన్నారు.

**ప్రభుత్వ కళాశాలల్లో అన్ని సౌకర్యాలు..**

లింగంపేట, ఫిబ్రవరి 19: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు పదోతరగతి విద్యార్థులకు వివరించారు. మండలంలోని శెట్పల్లి, పర్మళ్ల, శెట్పల్లిసంగారెడ్డి గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కళాశాలలో అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ప్రైవేటు కళాశాలల్లో కాకుండా ప్రభుత్వ కళాశాలలో చేరాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సాయి, శ్రీకాంత్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించాలి



నృత్యం చేస్తున్న ఇంటర్మీడియట్ విద్యార్థినులు

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 19: విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ మార్కులు సాధించాలని ప్రిన్సిపాల్ రాంప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని గోపాల్‌పేట మోడల్ స్కూల్‌లో బుధవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు బంగారు భవిష్యత్తు నిర్మించుకోవడానికి ఇంటర్మీడియట్ మొదటి మెట్టుగా భావించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు, ఉపన్యాసాలు, పాడిన పాటలు అలరించాయి.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బిచ్కుంద, ఫిబ్రవరి 19 : మండల కేంద్రంలోని 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా గురువారం మండలంలోని దౌల్తాపూర్, ఫత్లాపూర్‌గ్రామాలతో పాటు ఆర్‌డబ్ల్యూ ఫీడర్ పరిధిలోని గ్రామాల్లో ఉదయం10గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏఈ పవన్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు విద్యుత్ అంతరాయానికి సహకరించాలని కోరారు.

### బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 19: అనారోగ్యం బారిన పడి దవాఖానలో చికిత్స తీసుకుంటున్న బాధిత కుటుంబానికి స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు రూ.5లక్షల ఎల్‌వోసీని అందించారు. మండలంలోని కళ్యాణి గ్రామానికి చెందిన ఆకుల వెంకటి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో చేరాడు. అతడి గురించి ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వడంతో ముందస్తుగా రూ.5 లక్షలకు ఎల్‌వోసీని ఎమ్మెల్యే అందించారు.

## గురుకులంలో మ్యాథ్స్ రంగోళి

రామారెడ్డి, ఫిబ్రవరి19 : మండలంలోని ఉప్పల్‌వాయి సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులకు బుధవారం మ్యాథ్స్ రంగోళి పోటీలు నిర్వహించారు. పీఎం శ్రీ పథకంలో భాగంగా విద్యార్థులను 3 సర్కిల్స్‌గా విభజించి, ప్రతి సర్కిల్‌ను 25 మంది విద్యార్థులతో నిర్మించి వారికి పోటీలు నిర్వహించారు. పోటీల్లో మ్యాథ్స్ 1 సర్కిల్‌కు మొదటి బహుమతి వచ్చిందని ప్రిన్సిపాల్ శివారం తెలిపారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి, గణిత ఉపాధ్యాయులు హరిసింగ్, మెగాజీరావు పాల్గొన్నారు.

## ఇంటి పన్నుల లక్ష్యం పూర్తి చేయాలి

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 19: మండలంలోని ఆయా గ్రామాల్లో ఇంటి పన్నులను వంద శాతం పూర్తి చేయాలని ఎంపీడీవో ప్రభాకర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నెలాఖరు వరకు వంద శాతం పన్నులు వసూలు చేసి, వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

### కొలతల ప్రకారం పనులు చేపట్టాలి

లింగంపేట, ఫిబ్రవరి19: ఉపాధి హామీ పథకంలో కూలీలు కొలతల ప్రకారం పనులు చేపట్టాలని ఎంపీడీవో నరేశ్ సూచించారు. మండలంలోని శెట్పల్లి గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయన బుధవారం పరిశీలించారు. కూలీలు కొలతల ప్రకారం పనులు చేస్తే కూలి గిట్టుబాటు అవుతుందని, నామమాత్రంగా చేస్తే డబ్బులు తక్కువగా వస్తాయని పేర్కొన్నారు. అనంతరం కాంపోస్టు షెడ్డును పరిశీలించారు. ఆయనవెంట జీపీ కార్యదర్శి, ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడు, కూలీలు ఉన్నారు.

### సమస్యల పరిశీలన


డ్రైనేజీ పరిస్థితిని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఎల్లారెడ్డిరూరల్, ఫిబ్రవరి 19: పట్టణంలోని పలువార్డుల్లో నెలకొన్న సమస్యలను మున్సిపల్ కమిషనర్ మహేశ్‌కుమార్ బుధవారం పరిశీలించారు. పట్టణంలోని 5వ వార్డులో ఉన్న నర్సరీ, 10వ వార్డు వైశ్యభవన్ చౌరస్తా మూల మలుపు వద్ద ప్రమాదకరంగా ఉన్న డ్రైనేజీ, 11వ వార్డులోని డ్రైనేజీ, ప్రాథమిక పాఠశాలను ఆయన మున్సిపల్ ఏఈ వినోద్‌తో కలిసి పరిశీలించారు. సమస్యల పరిష్కారానికి ఏఈతో చర్చించారు.

## బీమా చెక్కు అందజేత


పెద్దదడ్గి గ్రామంలో గొల్ల హన్మాండ్లు కుటుంబానికి బీమా చెక్కును అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బిచ్కుంద, ఫిబ్రవరి19: బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికీ బీమా సౌకర్యం కల్పించి వారి కుటుంబాలకు ధీమానిస్తున్నదని పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రావు దేశాయ్ అన్నారు. మండలంలోని పెద్దదడ్గి గ్రామానికి చెందిన గొల్ల హన్మాండ్లు ఇటీవల ప్రమాద వశాత్తు మరణించాడు. ఆయనకు బీర్ఎస్ పార్టీ సభ్యత్వం ఉండడంతో పార్టీ కార్యాలయం నుంచి మంజూరైన రూ.2లక్షల బీమా చెక్కును బుధవారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నాల్చర్ రాజు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు రాజు పటేల్, గ్రామ తాజా మాజీ సర్పంచ్ సాయిలు, సహదేవ్, సాయిలు, హన్మంత్‌రావు, శంబాజీ, విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాలకు జారుడుబల్ల వితరణ

పెద్దకొడప్‌గల్, ఫిబ్రవరి 19 : మండలంలోని విఠల్‌వాడి తండా ప్రభుత్వ పాఠశాలకు విఠల్‌వాడి తండావాసి మదన్‌సింగ్ బుధవారం పిల్లలు ఆడుకునే జారుడుబల్ల వితరణ చేశారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటూ తన సొంత తండాలో పిల్లలకు విద్యపై ఆసక్తి కలిగేందుకు వారు ఆడుకునేందుకు జారుడుబల్ల అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.

## అదుపుతప్పి బైక్ ప్రమాదం

**● ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు**


ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రోడ్డుపై పడిపోయిన యువకులు

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 19: మండలంలోని మెదక్–ఎల్లారెడ్డి రహదారిపై మాల్తుమ్మెద శివారులోని విత్తన క్షేత్రం సమీపంలో ద్విచక్రవాహనంపై అతివేగంగా ప్రయాణిస్తూ అదుపుతప్పి కింద పడడంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై మల్లారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..సంగారెడ్డి జిల్లా హత్నూరా మండలం నవాబ్‌పేట గ్రామానికి చెందిన అబ్రహం, వీరేశంగౌడ్ బుధవారం తమ స్వగ్రామం నుంచి బైక్‌పై కామారెడ్డి జిల్లా పథాపహాడ్‌కు వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా మాల్తుమ్మెద శివారులో అతివేగంగా వస్తూ అదుపుతప్పి కింద పడడంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 సి బ్బందికి సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రులను స్థాని క ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అం దించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో 108 సి బ్బంది ఈఎమ్‌టీ అనిల్, పైలట్ మహేశ్ అంబులెన్సులో మెరుగైన చికిత్స కోసం మెదక్ తరలించారు. యువకులు ఇద్దరు మద్యం సేవించినట్లు ఎస్సై తెలిపారు.